# మనిషి

"త్వరగా రావాలి" ఎల్లప్ప చేతిలో డబ్బులుంచుతూ అన్నాను.

అతని ఓ కన్ను యాంత్రికంగా డబ్బుని లెక్కపెట్టడంలో మునిగి ఉంటే, రెండో కన్ను 'నాకెందుకు లెమ్మంటో' నిర్లిప్తంగా ఎటో చూస్తోంది.

ఎల్లప్పకూ నాకూ - నాకూ ఈ లాడ్జికి ఉన్న సంబంధం దాదాపు ఇరవయ్యేళ్ళది.

నేను ఆఫీస్ పనిమీద నెలకోసారయినా ఆదోని రావడం ఎంత అనివార్యమో - నారాక ఎల్లప్పకు తెల్సిపోవడం అంత అనివార్యం. ఎల్లా తెలుస్తుందో మరి - నేను వచ్చి కొన్ని క్షణాలైనా కాకముందే నన్ను వెదుక్కుంటూ వచ్చేస్తాడు.

సన్నగా - గాలికొడితే ఎగిరిపోయేట్లు ఉంటాడు ఎల్లప్ప. తమాషాగా ఉండే మెల్లకన్ను - మొహం నిండా అల్లుకున్న స్ఫోటకపు మచ్చలూ - అసహ్యామైన నలుపూ -

కానీ ఎల్లప్ప నమ్మకమైన వ్యక్తి - సక్రమమైన మార్గంలో వెళ్ళే వాళ్ళ విషయం నాకు తెలీదుగానీ చట్టవిరుద్ధమో - అక్రమమో అయిన పనులు చేసే వాళ్ళకు కావాల్సింది "నమ్మకమైన" వ్యక్తులే.

"రాత్రికి తోడు కావాలా సార్ - కొత్త సరుకుంది"

ఎల్లప్ప డబ్బుని చొక్కా జేబులో పెట్టుకుంటూ చాలా యథాలాపంగా అడిగాడు.

ఇన్నేళ్ళ పరిచయమున్నా ఈవిషయం చెప్పేటపుడు మాత్రం ఎల్లప్ప తన బిజినెస్ ట్రిక్స్‌ని మర్చిపోడు.

చాలా తగ్గు స్వరంతో "కొత్త సరుకు" అనే పదాన్ని వత్తి పలుకుతో చెప్తాడు. అలా అన్నపుడల్లా "అది నిజం - నమ్మమ" న్నట్లు చూస్తుంది మంచికన్ను. "ఈ పాపం నాకు దేనికి లెమ్మంటో" ఏ గోడవైపుకో తిరిగి పోతుంది మెల్లకన్ను.

మనం కొద్దిగా ఉత్సాహం చూపామా విశేషణాల పట్టీ చదివేస్తాడు. పిల్ల వెన్న ముద్దలానో-

జున్నుముక్కలానో ఉంటుందంటాడు. పదహారేళ్ళ కన్నా పదిసెకన్లయినా ఎక్కువ వయసు ఉండదంటాడు. ఆ ఎత్తు పల్లాల ముందు రతీదేవీ, రంభ పూర్వీకులు చిత్తు కావాల్సిందేనంటో పందెం కడతాడు. చివరికెలాగయితేనేం ఒప్పించి డబ్బుదాకా వచ్చేప్పటికి దాని నిలకడ మీదా - పెరిగే ధరల మీదా - అందుకునే ఆనందమూ - అయిన ఖర్చుల నిష్పత్తులతో సహా మాట్లాడి మీచేత ఓకే అన్పించేస్తాడు.

ఎల్లప్ప యెన్నుకున్న ఈ ఉద్యోగం జీవనది లాంటిది. రాజులూ రాజ్యాలూ మారినా - వేషభాషలూ పరిస్థితులూ మారినా - జీవన విధానంలో గణనాత్మకమైన మార్పులొచ్చినా - అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ మారనిది నరాల ఆకలి.

'సార్ - పిల్చుకు రానా' పట్టువదలని విక్రమార్కుడిలా ఎల్లప్ప.

"ఈరోజు వద్దులే ఎల్లప్పా - ఆఫీస్ పని కొంత మిగిలిపోయింది"

ఆ మొహంలో నిరాశ కన్పించింది. లేదా అలా అని భ్రమపడి ఉంటాను.

ఎల్లప్ప మొహంలో భావాలు చదవడం చాలా కష్టం. రెండు కళ్ళు రెండు రకాల భాష్యాలు చెప్తాయి. మొహంలో మరో భావం లాంటిదేదో కన్పిస్తుంది. ఈ మూడిటినీ సమన్వయ పరిస్తేనేగాని సరియైన అవగాహనకు రాలేం.

మరి కొద్దిసేపు నిశ్చలంగా నిలబడ్డాడు ఎల్లప్ప - నన్నెలా కన్విన్స్ చేయాలా అని ఆలోచించి ఉంటాడు. బహుశా జవాబు తట్టి ఉండదు. నిశ్శబ్దంగా బైటి కెళ్ళిపోయాడు.

లేచి తలుపు గడియ పెట్టేసి - ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌లో పెట్టి బెడ్‌మీద పడుకున్నా -

అనాయాసంగానే ఆ అమ్మాయి గుర్తొచ్చింది. మొట్టమొదటి సారి ఓ సంవత్సరం క్రితం అనుకుంటా చూశాను. అదీ ఓ క్షణమే.

విశాలమైన వెడల్పాటి కళ్ళూ - ఏ చిత్ర కారుడో అప్రమత్తతతో గీసిన అందమైన రేకుల్లాంటి పెదాలు. గొప్ప వైణికుని వ్రేలికొసల నుంచి జాలువారే సమ్మోహన రాగం లాంటి ఆ చిర్నవ్వు -

ఈ మధ్య ఆదోనికి క్యాంప్ కొచ్చే ప్రతిసారీ నాకా అమ్మాయి గుర్తొస్తోంది.

ఫెళఫెళలాడ్తున్న కొత్త కరెన్సీ నోట్‌లా - మాసిపోయిన బట్టల్లోనే ఇంతందంగా ఉంటే

- సరియైన బట్టల్లో ఇంకెంత అందంగా ఉంటుందో... వుహు - బట్టల్లోనే ఇంతందంగా ఉంటే - బట్టలేకుండా...

తలుపుమీద చేస్తున్న శబ్దం ఆలోచనని నొక్కేసింది. లేచివెళ్ళి తలుపుతీశాను. ఎల్లప్ప - లోపలికి వచ్చి, తలుపు దగ్గిరకంటా వేసి, కుర్చీ ముందుకు జరిపి, దాని మీద ఉంచాడు బాటిల్. చిప్స్ పొట్ల విప్పదీసి కాగితం మీద సీసా బరువుంచాడు ఫ్యాన్ గాలికి ఎగిరిపోకుండా - గ్లాస్ కడిగి ముందుంచాడు.

"తోడు లేకుండా తాగటం మొదటిసారిగా చూస్తున్నా సార్" నేలమీద చతికిలబడుతూ అన్నాడు ఎల్లప్ప.

'నీవున్నావుగా తోడు' అన్నాను గ్లాస్‌లోకి నీళ్ళు ఒంపుకుంటో - నాకు సోడాలూ - ఐస్ క్యూబులు ఇష్టం ఉండదు.

"ఎన్ని రోజులుంటార్సార్"

"'ఏం" అన్నట్లు చూశాను కొద్దిగా సిప్ చేస్తూ -

"ఆ పిల్ల.. రేపు పిల్చుకు వస్తాను"

వ్యాపారం నేర్చిన ఎల్లప్ప అంత త్వరగా వదిలిపెట్టడని తెల్సు.

మాక్‌డో వెల్ విస్కీ కొద్దికొద్దిగా తన ప్రభావం చూపిస్తోంది. మత్తుగా..... హాయిగా..... ఆ పిల్ల ఈ విస్కీకన్నా మత్తుగా ఉంటుందనుకుంటా. నా టేస్ట్లు అన్నీ ఒకే చోట కుప్పగా పోసినట్లు.... ఆల్చిప్పల్లా అందమైన కళ్ళు - ఇరవయికి ఖచ్చితంగా తక్కువైన వయసు - గుచ్చుకునేలా వక్షం......

ఎల్లప్పమీద కోపం - చిరాకు కల్గాయి.

"నేన్జెప్పిన అమ్మాయి విషయం ఏం చేశావ్" అసహనంగా అరిచినంత పనిచేశాను.

"ఎవరూ - ఆ పెద్ద కళ్ళ అమ్మాయని చెప్తుంటారు - అదేనా. దాన్దుంపతెగ - అదెవత్తోకాని నా ప్రాణం తీస్తుంది సార్ - ఎల్లా ఉంటుందో చెప్తే నాకెల్లా తెలుస్తుంది? ఓ రోజు చూపించండి - ఇట్టే లాక్కొచ్చేస్తాను"

ఏదీ! అంత సమయం దొరికితేనా! క్షణంలో కన్పిం చూపుల్లో గుచ్చుకుని - మరుక్షణం

మాయమైపోతుంది. అందుకే ననుకుంటా అంతాకర్షణ.

పక్కనెవరినయినా అడుగుదామంటె పరువు అడ్డొస్తుంది. నా ఖరీదైనబట్టలు - హోదా అడ్డొస్తాయి - నలభై పైబడిన నా వయసు అడ్డొస్తుంది.

"అవన్నీ నాకు తెలీదు - చాలా ఏళ్ళనించి ఈ వూర్లో ఉంటున్నావు - బిజినెస్ చేస్తున్నావు - నీకు తెలిసిన పిల్ల ఎవరుంటుంది? ఆమెను తెస్తే నీ మామూలు ఫీజు కాకుండా అదనంగా వందిస్తాను" అన్నాను ఖాళీ గ్లాస్‌లోకి విస్కీ ఒంపుకుంటో-

'ఎగిరి సూర్యుడ్ని ముట్టుకుంటె లక్షరూపాయలిస్తాను' అన్న పందెం విన్నట్లు వెర్రిగా చూశాడు ఎల్లప్ప.

"ఏం పిల్లలో సార్ - నిన్న పుట్టినోళ్ళు తోటకూర కాడల్లా ఎదిగి రెండో రోజుకే పైటలేస్తున్నారు. ఎవరని చెప్పను? కనీసం పేరైనా తెలీదాయె" - "నాకు సహాయపడలేక పోతున్నందుకు నొచ్చుకుంటో ఎల్లప్ప - అందులో తనకు వంద దక్కవన్న బాధే ఎక్కువ ఉండి ఉంటుంది.

"భోజనం పైకే పంపమని చెప్పు - వెళ్ళు" ఎల్లప్ప అసమర్థత మీది కోపం అంతా చూపిస్తో అన్నాను.

ఎల్లప్పకు తెలుసు - ఏ సమయంలో ఏ మందు వాడాలో - మెల్లిగా లేచి బైటికెళ్ళిపోయాడు.

'బ్లడీఫెలో' తిట్టుకున్నాను. ఆదోనిలోని నాల్గు బ్రోతల్ కంపెనీల్లో షేర్లున్నాయి ఎల్లప్పకు. కొత్తగా బ్రోకర్ ఉద్యోగం చేపట్టే వాళ్ళందరికీ గురువులాంటి వాడు. మనిషి ఎంత వికృతంగా, మొరటుగా కన్పిస్తాడో - ప్రవర్తన కూడా అలాంటిదే అంటారు.

"పాతివ్రత్యం - పవిత్రత" బీజాక్షరాలుగా వల్లించే ఆడవాళ్ళను సైతం లొంగదీసి వ్యభిచారంలోకి దింపడంలో ఎల్లప్పది అందెవేసిన చేయి.

కొత్త పిల్లల్ని కొనటం, అమ్మటం లాంటి వ్యాపారాలు కూడా చేస్తుంటాడని వినికిడి - నేనెప్పుడూ అతని బిజినెస్ వ్యవహారాల్లో తలదూర్చలేదు. అతను నా బిజినెస్ వ్యవహారాల్లో ఎప్పుడూ ఆసక్తి చూపించలేదు కాబట్టి -

ఆడవాళ్ళ పాలిట రాక్షసుడంటారు ఎల్లప్పని. కాని నాలాంటి వాళ్ళ పాలిట మాత్రం చాలా అవసరమైన వ్యక్తి.

గ్లాస్‌విండో మీద బల్లి పురుగుల కోసం కాచుకొని కూచుంది ..... నేను కావాలనుకున్నది పొందకుండా ఇన్నేళ్ళ జీవితంలో ఎప్పుడూ నిద్రపోలేదు... అతి జాగ్రత్తగా బల్లి పురుగు వైపుకు కదుల్తోంది.... సగం మూతబడే కళ్ళతో గ్లాస్ విండోవైపు ఆసక్తిగా చూస్తున్నా.... ఆ అమ్మాయిని పొందకుండా జీవితం వ్యర్థం... బల్లి పురుగుని ఒక్క వుదుటున నోట కరుచుకుంది. సంతృప్తిగా నిద్రలోకి జారిపోయాను.

★★★

ఆంధ్రాకేఫ్ దాటాక అకస్మాత్తుగా ఆగిపోయాయి కాళ్ళు - ఎన్నోఏళ్ళ తరబడి వెతుకుతున్న వస్తువు కన్పించినట్లుగా మంత్రించినట్లు ఆగిపోయాయి.

అంచులు చిరిగిన పావడా - పెద్దపూలున్న పరికిణీ - ఈజిప్షియన్ - గ్రీకు శిల్పాలకుండే శరీర సౌష్ఠవం.......

బడ్డీదగ్గిర నిలబడి ఎల్లప్పతో మాట్లాడుతోంది. మొదట ఆశ్చర్యపోయాను. ఎల్లప్పకీ పిల్ల తెలుసా అని. తర్వాత రక్తనాళాల్లోకి అమృతం ప్రాకుతున్నంత హాయిగా ఫీల్ అయినాను - ఎన్నాళ్ళ కోరికో తీరబోతున్నందుకు.

పక్కన కొల్లీగ్స్‌ని చూసి ఎల్లప్పను పిలవకుండా ఆగిపోయాను. ఎల్లాగూ తనెవరో తెల్సిందిగా. రాత్రికి ఏకంగా రూంకే పిలిపించుకోవచ్చు. టెలిగ్రాఫ్ ఆఫీస్‌కెళ్ళి మరో రోజు ఉండిపోవాల్సి వస్తుందని హెడ్ ఆఫీస్‌కి టెలిగ్రాం ఇచ్చాను.

మామూలు కంటె ముందుగానే రూంకెళ్ళిపోయాను.

ఆ అమ్మాయి కళ్ళముందుకదులాడ్తోంది. రాళ్ళను ఢీకొంటూ పారేకొండ నీరు గుర్తుకొస్తుంది ఆమెను తల్చుకుంటె.

ఎల్లప్పకిటువంటి పనులు వెన్నతో పెట్టిన విద్య. లొంగని ఆడదాన్ని బెండు ముక్కలా వొంచేయగలడు.

తన సర్వీస్‌లో ఎంత మంది కన్నెపిల్లల్ని ఈ వృత్తిలోకి దింపేడో అదో పెద్ద అడ్వెంచర్‌లా

చెప్తాడు ఎల్లప్ప.

"నన్ను రాక్షసుడినంటో తిట్టింది సార్ ఒకటి" మురిసిపోతో చెప్తాడు అదో బిరుదైనట్లు-

ఓసారెవరో అమ్మాయి సీసాతో తల పగులకొట్టిందట. కుట్లుపడ్డాయిట - నుదురు చూపిస్తో "పొగరుమోతు గుంటల్ని లొంగదీశాను ఇదో లెక్కా.... నాల్గురోజులు కూడా, నీళ్ళు ఇవ్వటం మానేస్తే సరి - కాళ్ళ బేరానికొస్తారు" తల ఎగురవేస్తో చెప్తాడు.

ఎల్లాగూ ఈ అమ్మాయి ఎల్లప్పకు తెల్సినదే కాబట్టి అంత కష్టపడాల్సిన అవసరం రాదనుకుంటూ.

స్నానం పూర్తిచేసి టేబిల్ ఫాన్ ముందు ఛెయిర్ వేసుకు కూచున్నా. చాలా హాయిగా చల్లగా ఉంది. లోపల చాలా వేడిగా కోరిక బుసకొడుతోంది.

'సార్' ఎల్లప్ప తలుపుకొడ్తున్నాడు మెల్లిగా.

ఒక్క వుదుటున వెళ్ళి తలుపు తీశాను.

"నీ కోసమే చూస్తున్నా - త్వరగా రా లోపలికి"

తలుపువేసి వచ్చి నిలబడ్డాడు.

"ఆ అమ్మాయిని చూశానీరోజు"

"చూస్తే ఏం ప్రయోజనం సార్ - అదెవత్తో తెలిస్తే కదా పని జరిగేది" అన్నాడు - లాభం లేదు - నీవంద నాకు ప్రాప్తం కాదన్నట్లు.

'నీకు తెలుసా పిల్ల'

'నాకు తెలుసా?'

'అదే. ఈ రోజు సాయంత్రం ఆంధ్రాకేఫ్ పక్కన నీతో మాట్లాడ్తూ నిలబడింది చూశావా - పెద్ద పూల పరికిణీ - ఎర్రబార్డర్ పావడా....'

గుర్తొచ్చిందా అన్నట్లు చూశాను ఎల్లప్ప వైపు.

ఎల్లప్పలో నేనెప్పుడూ చూడని మార్పు. కొద్దిగా వణుకుతున్నాడు - పెదవులు అదురుతున్నాయి.

మంచికన్ను మొదట తడిదేరి - ఎండిన బుగ్గల్ని తడుపుతోంది.

"ఎల్లప్పా - ఒంట్లో బాగోలేదా" ఇంత మంచి సమయంలో కన్నీళ్ళు - బాధలూ. ప్ఛ్ - చిరాకు నాకు.

ఎల్లప్ప నిశ్శబ్దంగా - పిలుస్తున్నా పట్టించుకోకుండా బైటికెళ్ళిపోయాడు.

రాస్కెల్ - వీడికెంత పొగరు?

రాత్రంతా నిద్రకోసం పోరాటం... ఎల్లప్ప మీద కసిగా - కోపంగా ఉంది. వాడికేవో కష్టాలూ - కన్నీళ్ళు ఉంటె వాటిని నా ఎదురుగా ఒలకబోయడం దేనికి? డర్టీ క్రీచర్... నా ఆనందాన్ని పాడుచేశాడు. ఈసారి కనిపిస్తే తన్నాలన్నంత ఆవేశం నాలో.

ఉదయం కూడా ఎల్లప్ప రాలేదు.

ఇంక అక్కడ ఉండాల్సిన అవసరం ఏమీ కన్పించలేదు. రూంబాయ్‌ని పిలిచి సామాన్లు బస్‌స్టాండ్ వరకూ మోసుకు రమ్మన్నాను. బస్‌స్టాండ్ లాడ్జికి దగ్గరగా ఉంటుంది.

మలుపు తిరుగుతున్నప్పుడు ఆ అమ్మాయిని రోడ్డుమీద వడివడిగా నడుస్తో చూశాను. అదే రంగు పావడా - వక్షాన్ని కప్పుతో - పూల పరికిణీ -

ఎల్లప్పను చంపేయాలన్నంత కోపం - రాత్రి అలా వెళ్ళిపోయినందుకు -

"ఆ అమ్మాయి తెలుసంట్రా నీకు" అన్నాను సామాన్లు మోస్తున్న కుర్రోడితో - వాడూ చూశాడు దూరంగా వెళ్తోన్న ఆ అమ్మాయిని -

"ఎందుకు తెలీదు సార్ - ఆ పిల్ల ఎల్లప్ప కూతురు" అన్నాడు ఇంటర్వ్యూలో ప్రశ్నకు ఠకీమని జవాబు చెప్పినపుడు కలిగే ఆనందంతో పొంగుతో -

ఒక్కసారిగా - గుండె కొట్టుకోవడం - మెదడు పనిచేయటం - శ్వాస ఆడటం - అన్నీ ఆగిపోయినట్లనిపించింది.

ఎల్లప్పకింత అందమైన కూతురుందా ? ఇంపాసిబుల్. ఎల్లప్ప ఇరవయేళ్ళ నుంచీ తెల్సు నాకు - అతనికి పెళ్ళే కాలేదు. దూరపు బంధువనుకోటానికి కూడా వీల్లేదు. ఎపుడడిగినా "నాకెవరూ లేరు సార్ - చిన్నప్పుడే అమ్మానాన్న పోయారు. ఆ తర్వాత ఎలా బ్రతుకీడ్చానో మీలాంటోళ్ళు వినలేరు సార్ - అదంతా రోడ్డుకి అంకితమైన బ్రతుకు" అనే ఎల్లప్పకు కూతురా!

"నీకెవరు చెప్పారు" అన్నాను ఆందోళన వ్యక్తం కాకుండా ........

"మా ఇంటి దగ్గిరే సార్ వాళ్ళిల్లు - వసంతా టాకీస్ దాటి కొంత దూరం పోయాక సారాకొట్టు లేదూ - దానికి మూడు గుడిశెలవతలె వాళ్ళిల్లు"

ఆలోచిస్తూ నడుస్తున్నా - అదే నిజమైతే ఎల్లప్ప నొచ్చుకొని ఉంటాడు.

బస్టాండ్‌లో లగేజ్ పెట్టి ఆ అబ్బాయిని అక్కడే ఉండమని చెప్పి వసంతా టాకీస్‌వైపు బయల్దేరాను.

వసంతా టాకీస్, సారాకొట్టు దాటాక... అల్లుకున్నట్లు గుడిశెలు. ఒకటి, రెండు, మూడు అంటూ లెక్క పెడ్తో ఎల్లప్ప ఇల్లు కనుక్కోడానికి అవి ఓ క్రమంలో లేవు -

అటుగా వస్తున్న ఓ అబ్బాయనడిగాను.

"ఇదే" నంటో నా పక్కనే ఉన్న ఇల్లు చూపించాడు. మరీ గుడిశెలా లేదు - పైన పెంకులు కాకుండా ఆకులు కప్పిన చక్కటి ఇంటిలా ఉంది. బైట వసారా -

లోపలికి వెళ్ళి తలుపు తడుతో పిలిచాను.

అదే అమ్మాయి. ఆ పెద్ద పెద్ద కళ్ళ అమ్మాయి - తలుపు పూర్తిగా తెరచి ఆ జాగాలోంచి ఆశ్చర్యంగా కళ్ళింకా పెద్దవి చేసుకొని చూస్తోంది.

"ఎల్లప్ప లేడా"

"లేడు - ఇంకో గంట తాలితే కూటి కొస్తాడు" ఇంకా కుతూహలంగా చూస్తోనే ఉంది నా వైపు.

ఏం మాట్లాడాలో తెలీలేదు.

"ఏమన్నా పనా" కళ్ళు చక్రల్లా తిప్పుతో అడిగింది.

"ఏం లేదని" చెప్పి వెనక్కి తిరిగాను. అలా తిరిగేటపుడు చూశాను గోడమీద పోటో వైపు.

అవే కళ్ళు - అల్చిప్పల్లా - సమస్త విశ్వాన్నీ తమలో ఇముడ్చుకోగల ఔదార్యం కురిపిస్తో.. ఆ చిర్నవ్వు.... జ్ఞాపకాల పొరల్లో - ఎక్కడో - ఏదోమూల...... ఆ చిర్నవ్వు...

ఒక్కసారిగా ఆ అమ్మాయివైపు తిరిగాను.

తలుపు నొక చేత్తో పట్టుకొని విస్మయంగా చూస్తోంది నా వైపు.

"ఆ ఫోటో...." ఆగిపోయాను. మాటరావడం లేదు.

" ఆ ఫోటో మా అమ్మది. నేను పుట్టినపుడే చనిపోయిందట".

ఇంకో క్షణం కూడా అక్కడ ఉండలేదు నేను. పరుగులాంటి నడక... ఆ ఫోటోనించి దూరంగా - భయంతో పారిపోతున్నట్లు నడక... నన్ను వెంటాడుతో - నావెనకే ఆ చిర్నవ్వు... ఇరవై ఏళ్ళ నాడు మొట్టమొదటిసారి ఆ చిర్నవ్వు వింటో - ఆమె కౌగిట్లో కాలాన్ని కరిగించాను.

ఆమె కమల.

"మొదటి బోణీ మీదే సార్" అంటే రెండొందలిచ్చి ఓ రాత్రికి కొన్న కమల - తనకీ పని యిష్టం లేదంటో వెక్కి వెక్కి ఏడుస్తుంటే ... నేను ఖర్చుచేసిన డబ్బుకు ప్రతిఫలం ఆశిస్తో అన్నీ అబద్ధాలే చెప్పాను.

ఎల్లప్ప పని చేసే కంపెనీలో ఓ బజారు స్త్రీకి పుట్టి పెరిగిన కమల తనకూ పెళ్లి చేసుకోవాలనుందంటే మనసులో నవ్వుకున్నా పైకి "నేను పెళ్ళి చేసుకుంటానన్నాను".

భర్తకు తప్ప మరొకరికి శరీరాన్నివ్వనంటే "ఈ క్షణం నించీ నేనే నీ భర్త" నని ప్రమాణం చేశాను.

చివరికి బలవంతం - రభసా లేకుండా - అతి మృదువుగా కమల లొంగిపోయిందా రోజు.

స్త్రీ కొత్త కాకున్నా నాకారాత్రి అన్నీ కొత్త-వింత అనుభూతుల్నిచ్చింది కమల.

ఆ రోజుల్లో ఆదోని వెళ్ళినపుడల్లా ఎక్కువగా కమలే వస్తుండేది. తనక్కావాలంటూ ఎపుడూ ఓ రూపాయైనా అడగని కమలను పిలిపించుకోవడంలో డబ్బు ఆదా అవుతుందని సంబరపడుతుండేవాడిని.

ఓ రోజు తనూ నాతో వచ్చేస్తానంటో పేచీ పెట్టింది.

"నేనిక్కడ క్షణం ఉండలేను. ఆ ఎల్లప్ప ఎవడి దగ్గిరకో పొమ్మంటాడు. లేకపోతే తిండి పెట్టనంటాడు - చూడండి - బెల్ట్‌తో ఎల్లా కొట్టాడో" ఒంటిమీద స్పష్టంగా కన్పిస్తున్న వాతలు చూపించింది.

ఆ రాత్రి గుండెల మీద తల ఉంచి "నన్నీ నరకం లోంచి తీసికెళ్ళరూ" అంటూ కన్నీళ్ళతో ప్రాధేయపడింది.

"చిన్నప్పటినుంచీ అమ్మ తన పక్కన కూచోపెట్టుకుని చెప్తో ఉండేది నేను తనలా కాకూడదని.... పెళ్ళిచేసుకొని హాయిగా కాపురం చేయాలనీ... అందుకోసం తనెంత కష్టమైనా భరిస్తాననేది. ఏమైనా చేస్తాననేది. చివరికి ఏమీచేయకుండానే నన్నొ వంటరిదాన్ని చేసి చనిపోయింది"

ఆ రాత్రంతా కమల ఎన్నెన్నో విషయాలు చెప్తూనే ఉంది. వాళ్ళమ్మ రోగాల్తోటే చచ్చిపోయిందిట. తనీ వృత్తి చేయకూడదని చివరికోర్కెగా కోరిందిట.

"మా అమ్మ కోర్కె తీర్చడానికి ఒకే ఒక ఆధారం మీరు. నన్నన్యాయం చేయరుగా" తన వెడల్పాటి కళ్ళలోంచి నీరు ఉబుకుతుంటే - ఎన్నిసార్లు చెప్పిందో.

కొన్నాళ్ళు ఎల్లప్పకు నెలానెలా కొంత డబ్బిచ్చే వాడిని కమల ఖర్చుకోసం.

ఆ తర్వాత అనవసరం అన్పించింది. నిరంతరం వెరైటీ కోరే నా మనసుకు కమల పాతబడిపోయింది.

ఒకటి రెండుసార్లు ఎల్లప్ప కమల విషయం చెప్పేవాడు "అది మీతో తప్పితే ఎవ్వరి దగ్గరకూ పోనంటుంది సార్. కొట్టినా - తిట్టినా సహిస్తుంది. చంపేసినా ఒప్పుకుంటానంటుంది. కానీ వేరే వ్యక్తి ముఖం చూడనంటుంది. అటువంటి దాన్ని ఎప్పుడూ చూళ్ళేదు సార్" అంటో.

నేను చిరాకు పడేవాడిని. ..... గట్టిగా చెప్పానోసారి కమల విషయం ఎత్తవద్దని.

పాప పుట్టాక - కమల ఆత్మహత్య చేసుకుందని తెల్సినపుడు..... కొన్ని క్షణాల బాధపడ్డాను. నేను జీవితంలో బాధపడిన అతి కొద్ది క్షణాల్లో - ఆ క్షణాలు కొన్ని.

."వాళ్ళమ్మ కోరిక తీర్చింది సార్ - జీవితంలో ఒకర్నే నమ్ముకుంది -" అంటో ఆమెను పొగిడే ఎల్లప్ప నించి కొన్నాళ్ళు తప్పించుకునే ప్రయత్నాలు చేశాను. ఆమె జ్ఞాపకాల్ని బలవంతంగా విదిలించుకున్నాను.

సుఖపడటానికే జీవితం అని నమ్మిన నాకు కమలను పూర్తిగా మర్చిపోడానికి ఎక్కువ

కాలం పట్టలేదు.

మరలా ఇపుడు - ఆ జ్ఞాపకాలు - తరుముకుంటో....

బస్‌లో స్థిమితంగా కూచోలేక పోతున్నా....

బస్ కదిలి - ఆదోని నుంచి కొన్ని పదుల మైళ్ళు దాటాక - మనసు కొంచెం స్థిమిత పడింది.

కానీ ఆసంఘటన నాలో పెద్ద మార్పేమీ తీసుకు రాలేదు. సినిమాల్లోలా - కథల్లోలా ఆమెను నా కూతురంటో చదివించి - పెళ్ళి చేయించలేదు. డిగ్రీ చదువుతున్న నా కూతురు - ఆమె భవిష్యత్తు - సంఘంలో నా పలుకుబడీ - గౌరవం - ప్రాక్టికల్‌గా ఆలోచించడానికి అలవాటు పడ్డ నా మనసూ.... ఇవన్నీ గుర్తొచ్చి ఏవీ జరగనట్టే ప్రవర్తిస్తున్నాను.

ఆదోనివెళ్ళే ప్రతిసారీ ఎల్లప్ప కలవకున్నా నా "హాబీలు" నిరాటంకంగా సాగిపోతున్నాయి. బోల్డు బలగం ఉంది నా "ఫీల్డు"లో సహాయపడటానికి. దేశంలో ఆ విషయంలో కొరత లేదు.

ఎటొచ్చీ నాలో ఒకే ఒక మార్పొచ్చింది. ఎల్లప్ప అందరూ అనుకునేట్లు రాక్షసుడు కాదనీ - అతనిలో మానవత్వం మామూలుకన్నా కొద్దిగా ఎక్కువేనని నమ్మటం ప్రారంభించాను. ఇలా నమ్మడం వల్ల నాకేమీ నష్టం కనిపించలేదు కాబట్టి.

● *ఆంధ్రభూమి వారపత్రిక ఆగస్టు, 1980* ●

కాం7, 8/4/97